దొంగపెద్దమనిషి

ఊళ్ళో దొంగల హడావిడి చాలా ఎక్కువగా ఉంది. గతించిన వారంరోజులలో మరీ చెలరేగి పోయినారు. ఒక్కొక్క రాత్రికి రెండుమూడు ఇళ్ళు సర్దుకొంటున్నారు. పేటలో వాళ్ళంతా హడిలిపోయి ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని పడుకొంటున్నారు.

ఎందుచేతో ఏమో, వాళ్ళు మాయింటికి ఇంతవరకు రాలేదు. రాలేదుకదా అని ఇక రారు అనుకొంటానికీ వీల్లేదు. ఎప్పుడో వస్తారు మనవంతు వచ్చినప్పుడు! రాత్రిళ్ళు కాస్త జాగ్రత్తగా వుండటం మంచిది అనుకొన్నాము.

జాగ్రత్తగా వుండటం అంటే ఏమిచెయ్యాలి అని ప్రశ్న వచ్చింది. నేనూ మా యింట్లో అద్దెకున్న రామకృష్ణయ్యగారూ, మా పిల్లలూ, మా ఆవిడా అంతా కూర్చుని, దొంగలు రాకుండా ఉండటానికి ఏమిచెయ్యాలా అని ఆలోచించాము.

ఒక పద్ధతి మేలుకొని కూర్చోటం: ఇది ఎవ్వరూ ఒప్పుకోలేదు. ఒప్పుకోక పోవటానికి రెండు కారణాలు కన పడ్డవి. ఒకటి అసలు, వాళ్ళు మన ఇంటికి రాదల్చుకొన్నారో లేదో. వస్తారని తెలిస్తే మేలుకొని కూర్చోవచ్చుగాని ఆ విషయం గట్టిగా తెలియనిదే, ముందుగానే మేలుకుని కూర్చుంటే, చివరకు వాళ్ళు రాకపోతే మన శ్రమ అంతా వృథాయైపోతుంది. పైగా వాళ్ళు మనం మేలుకొని కూర్చోటం చూచి, ఓహోహో ఈ ఇంట్లో ఏదో కాస్త ఉంది. లేకపోతే

ఎందుకు తెల్లవార్లూ మేలుకొని కూర్చుంటారు. సరే, సమయము కనిపెట్టి ఈ ఇంటికి మనం వెళ్ళితీరాలని అనుకో వచ్చు. ఇంతవరకు వాళ్ళు మన ఇంటికి రాలేదు బహుశః వాళ్ళు ఈ కొంపలో మనకు దొరికేదేమీ ఉండదూ అనుకొని ఊరుకొన్నారేమో! ఇప్పుడు ఈ జాగరణవల్ల వారికి ఇంకో అభిప్రాయం కలిగితే వాళ్ళను మనం మన ఇంటికి ఆకర్షించినట్లు అవుతుందికదా! కాబట్టి అల్లా చేయవద్దు అన్నారు అంతా.

రెండవ విషయం: మేలుకొని కూర్చోవాలన్నా, ఎన్నాళ్ళని మేల్కొనగలము. ఒకరాత్రి మేలుకూర్చుంటే, మర్నాటికల్లా నిద్ర ముంచుకొస్తుంది. కళ్ళు తెరిపిడిపడవు. కాబట్టి ఈ ప్రతిపాదన కొట్టేశాము.

ఇది కొట్టేసినా, ఇంకోవుపాయం ఏమీ తోచలేదు. చాలాసేపు ఆలోచించాము. ఒకరన్నారూ, 'ఈ యింట్లోకి రాత్రిళ్ళు అనుజ్ఞలేకుండా వచ్చినవారు శిక్షింపబడుదురు' అని ఒక కాగితంమీద వ్రాసి గేటుకు అంటిస్తే కొంతలాభం ఉండకపోతుందా అని! దొంగతనము చేయరాదు అని వ్రాసి పెట్టటం మంచిది అని ఇంకొకరన్నారు. దొంగలు ఎప్పుడూ మన అనుమతి తీసుకొనిరారు. దొంగతనము చేయకూడదని వాళ్ళకు తెలిసే చేస్తున్నారుగాని తెలియక కాదు. కాబట్టి ఎల్లాగ వ్రాసినా లాభం లేదని తోచింది.

కాబట్టి ఇంకేదైనా ఉపాయం ఉందేమోనని ఆలోచన చేయవలసి వచ్చింది.

రామకృష్ణయ్యగారు తల గిరాగిరా తిప్పుతూ ఇల్లా అన్నాడు. "దొంగతనము చేయరాదు - అని నీతులు చెపితే రాకుండా ఉంటారుటండీ. మీ రందంతా తెలివితక్కువతనం కాకపోతే! దానికో ఉపాయం ఉంది" అని చిరునవ్వు నవ్వాడు.

ఆ ఉపాయం ఏమిటో చెప్పండి బాబూ - అని మేము ప్రాధేయపడ్డాము. ఆయన అన్నాడూ "దానికేం లేదు. ఈ ఇంటికి కన్నంవేసి కష్టపడి లోపల ప్రవేశించినా ఏమీ లాభం వుండదు అని వాళ్ళకు తోస్తే వాళ్ళు ఎందుకొస్తా రండీ" అని.

నిజమే ఆమాట. మన యింట్లో ఏమీ లేదని తోస్తే వాళ్ళు ఎందుకొస్తారు? బాగానేవుంది. అయితే అల్లాటి నమ్మకం వాళ్ళకు కలుగజేయటం ఎల్లాగా అన్నది ప్రశ్న అయింది.

దానికీ ఆయనే చెప్పాడు జవాబు. "ఈ యింట్లో ఉండే వెండి, బంగారు వస్తువులన్నీ బ్యాంకిలో పెట్టాము. ప్రస్తుతం ఏమీ లేవు" అని వ్రాసిపెడితే మంచిది అని.

ఇది బాగానేవుంది కాని దీనికో చిక్కు వచ్చిపడ్డది. అసలు మనకు బంగారపువస్తువులే లేవాయెను, ఉన్న కంచాలు రెండూ పూరాపూరాసినవాయెను! అల్లాంటప్పుడు మనకేదో వెండీ, బంగారమూ ఉన్నట్టు అబద్ధమాడి వాళ్ళని ఆశపెట్టటం ఎందుకూ అని! అవి బ్యాంకినుంచీ ఎప్పుడో తెస్తావా అని వాళ్ళు ఎదురుచూస్తుంటారు - అదో తద్దినం తెచ్చిపెట్టుకొన్నట్టు అవుతుంది. అల్లా చెయ్యవద్దని నిశ్చయించుకొన్నాము. ఇల్లాగ అబద్ధం ఆడినా, దీనివలన ప్రయోజనం లేకపోయె!

అయితే ఏం జెయ్యాలె? అబద్ధం ఆడినా దానివలన ప్రయోజనం వుండాలె. ఏ అబద్ధం ఆడితే అల్లాంటి ప్రయోజనం కలుగుతుంది అని మళ్ళీ ఆలోచనచేయగా ఒకటి తోచింది.

"అల్లా అయితే ఒకపని చేయండి. ఈ యింట్లో భయంకరమైన కుక్కలున్నవి. కొత్తమనుష్యులను పీకి చంపుతవి" అని వ్రాసిపెడితే దొంగలు తప్పకుండా భయపడిపోయి ఈ చాయలకు రారని రామకృష్ణయ్యగారు అన్నారు.

ఈ ఆలోచన బాగుందంటే బాగున్నదని అంతా అన్నారు. అల్లాగే వ్రాసి గేటుకు అంటించివేశాము.

ఇక నిర్భయంగా పడుకోవచ్చునుగదా అని పక్కలు సద్దుకుంటూవుంటే ఇంకో ఆలోచన వచ్చింది. ఇంతాజేస్తే వాడు ఆ కాగితంముక్క చూస్తాడో చూడడో అని!

ఇది కొత్త చిక్కు!

"దొంగదగ్గిర టార్చిలైటు వుంటుంది నాన్నా. వాడు తప్పకుండా చూస్తాడు" అన్నాడు మా పెద్ద అబ్బాయి.

"టార్చిలైటు వుంటుందనరే. ఇక్కడేం వ్రాసివుందీ చూద్దామని బుద్ధి బుడితేగదా వాడు టార్చి వేయటం. అసలు వాడి కా బుద్ధి ఎందుకు పుడుతుంది?" అని చిన్నవాడునవ్వాడు. నిజమే ఆమాట. వాడికి ఎందుకుతోస్తుంది! ఇక్కడ నాకోసం ఏమైనా వ్రాసపెట్టారేమో చూద్దామనుకుంటాడా వాడు? అటువంటి ఆచారం లేదాయె మనదేశంలో!

కాబట్టి ఒక చిన్నదీపం అక్కడ పెట్టటమూ, ఆదీపపు కాంతిలో ఆ నోటీసు కనపడుతూ వుండేలాగున చేయటమూ, అవసరమని తోచింది. వెంటనే ఒక కోడిగుడ్డు లాంపు వెలిగించి

తాటియాకుల గుమ్మటంలో పెట్టి, గేటు దగ్గరగా గన్నేరు కొమ్మకు వ్రేలాడతీశాము. ఇక పరవాలేదు. అసలు ఈ దీపం చూచే దొంగరాడు. వచ్చినా, ఈ నోటీసు చూచి పారిపోతాడు. చూస్తూ, చూస్తూ, చూస్తూ కుక్కలున్న ఇంట్లోకి వచ్చి ఎవరూ ప్రాణంమీదికి తెచ్చుకోరు అని అనుకొని, పక్కలు పరుచుకొన్నాము - నిశ్చింతగా నిద్రపోవటానికి. మొదట అందరమూ ఒకచోట పడుకొందామనుకొన్నాము. కాని అల్లా అయితే పక్కగదిలో వాడు ప్రవేశించి దోచుకొని పోతుంటే మనకు ఏమీ తెలియకుండా పోతుంది. కాబట్టి ఒక్కొక్క గదిలో ఒక్కొక్కరం పడుకొంటేమంచిది అని నిశ్చయించాము. మా ఆవిడా, రామకృష్ణయ్యగారి భార్యా, మా పిల్లలూ, అంతా వంటింటి ప్రక్కనున్న గదిలో పడుకొన్నారు. మనకున్న ఆస్తిఅంతా అక్కడున్న చెంబూ, తప్పాలేగా? అందుకని వాళ్ళక్కడ పడుకొన్నారు. పక్కగదిలో నేనూ, వీధివసారాలో రామకృష్ణయ్యగారూ పడుకొన్నాము.

కాని నిద్రపడుతుందా, చస్తుందా! అనేక ఆలోచనలాయెను? ఇంతాజేస్తే వాళ్ళు ఆ కాగితం చూడరేమో? కుక్కలున్నాయని నమ్ముతారా అసలు? ఈ నమ్మకం కలుగజేయటం ఎట్లాగా అని ఆలోచించాను.

ఇంతలో రామకృష్ణయ్యగారు పక్కగదిలోనుంచి తలుపుతీసికొని నేనున్న గదిలోకి వచ్చాడు. ఏమండీ! మీకూ నిద్రపట్టలేదా? అన్నాడు.

"ఎట్లా నిద్రపడుతుందీ, ఒక్క విషయమూ తేలకుండా ఉన్నది? మన ఇంట్లో నేమో కుక్కలు లేవాయను. ఆ సంగతి వాడికి ఇదివరకే తెలుసునేమో? వాడొచ్చి "ఏమయ్యా, పెద్దమనిషి వనుకున్నాను, ఇల్లాగ అబద్ధాలు వ్రాశావు! ఇది బాగుందా" అని అడిగితే ఏం జెప్పాలండీ? అన్నాడు.

"ఏం చెప్పటం సంగతి ఎందుకండీ వాడు వచ్చేస్తాడేమోనని భయపడి చూస్తున్నాను నేనూ" అన్నాను.

"కుక్కలు లేవని తెలిస్తే రాకమానాడు టండీ?" అన్నారు ఆయన.

"అయితే ఇక్కడ కుక్కలున్నాయని వాడికి నమ్మకం కలుగజేయటం ఎల్లాగ?" అని అడిగాను.

"అదేనండీ నేనూ ఆలోచించాను. నేను ఒక మాట చెబుతాను - మీరు ఏమీ అనుకోకపోతే ఈ ఇంట్లో కుక్కలున్నట్లు వాడికి తెలియటానికి కుక్కల్లాగ మనం కాసేపు మొఱగటం అవసరం అని నాకు తోస్తున్నది. ఏమంటారు?" అన్నాడు.

ఇది అంత పెద్దమనిషి తరహా కాదు. అయినా ఏంజేస్తాము? ఆపద సమయము; తప్పదు అనుకొన్నాము. ఆ సంగతి మా ఆవిడతో చెప్పి, నీవుకూడా యీ విషయంలో సాయ పడమంటే, ఆవిడ 'ఛా, ఛా మీరు మొఱగండి కావలిస్తే, నేను మొఱగను' అన్నది. మా పెద్ద అబ్బాయి మటుకు మాతో కలవటానికి సంతోషంతో ఒప్పుకొన్నాడు.

సరేనని ఆయనా, నేనూ, మా అబ్బాయీ కలిసి బైట వరండాలో కూర్చుని కాసేపు అరిచాము. ఎట్లాగయినా

ఇద్దరం చదువుకున్న వాళ్ళం. కళాదృష్టి కలవాళ్ళం. ఇల్లాంటి వాళ్ళు ఏపని చేసినా బాగా చేస్తారన్నమాట నిజము. రెండు కుక్కలు పోట్లాడుకొంటున్నట్లు, దెబ్బతిని ఏడుస్తున్నట్లు, భయంతో మొరుగుతున్నట్లు, కోపంతో గర్జిస్తున్నట్లు, రకరకాలుగా అరిచాము కాసేపు. మర్నాడు తెలిసింది అంతా చెపితే, అచ్చంగా కుక్క అరుపుల లాగే ఉన్నాయట మా అరపులు. ఒకాయన అన్నాడుకూడా "ఏమీ భేదం లేదండీ నిజంగా కుక్కలే అరుస్తున్నాయి అనుకొన్నాము. ఆమాట కొస్తే కుక్కలకంటేకూడా బాగా మొఱిగారు మీరు. అంత చక్కగా అందరూ మొఱగలరనా? ఎబ్బే! ఏజన్మానో మీరు కుక్కలై ఉండాలె. లేకపోతే అంతచక్కగా రాదనుకోండి." అని మాకు నమ్మకంగా చెప్పాడు. ఏమో? నిజమేమో? కాదని ఎవరు అనగలరు. ఆ పూర్వజన్మవాసనే మాకు అల్లాంటి బుద్ధి పుట్టించిందేమో?

ఈపని పూర్తి అయ్యేసరికి రాత్రి రెండు కావస్తున్నది. నిద్ర ఆపలేకుండా ఉన్నాము. అందుకని వెంటనే పడుకొన్నాము ఇక దొంగలొస్తారని భయం లేదనే నమ్మకంతో.

* * *

అప్పటికి రాత్రి రెండు గంటలు అయి ఉంటుంది. వెంటనే నిద్రపట్టింది. కొంతసేపటికి దొడ్డితలుపుదగ్గర ఏదో చప్పుడైనట్లు తోచింది! లేచి వెళ్ళిచూశాను. అక్కడ ఎవ్వరూ లేరు. మళ్ళీ వచ్చి పడుకొన్నాను. పడుకున్నానన్న మాటేగాని, నిద్రపడుతుందా ఏమన్నా! ఏదో భయ మాయె! మన ఇంట్లో వెండీ బంగారము లేనుకదా; వాడు

వచ్చి ఎత్తుకుపోయేది ఏముందిలే అని మనస్సుకు ధైర్యం చెప్పుకొన్నా, మళ్ళీ ఆ ఉన్న చెంబూ తప్పాలా కాస్తా ఎత్తుకుపోతాడేమో నని భయం. అది చాలదూ మన ప్రాణానికి? మళ్ళీ కొనుక్కోగలమా? ఏమన్నానా?

ఎట్లాగో మళ్ళీ కాస్త కునుకుపట్టింది. గదిలో ఎవరో నడుస్తున్నట్లు అలికిడి అయి లేచాను. చీకటిగా ఉంది. దీపం లేదు కాని కొద్దిగా కనబడుతున్నది. కళ్ళు బాగా తెరిచి చూద్దునుకదా, ఓమూలనుంచి ఎవరో మనిషి నావైపు నడిచి వస్తున్నాడు. ఇంకేముంది? కొంప మునిగింది? దొంగ రానేవచ్చాడు?

'ఎవరువారు?' అన్నాను.

'నేనే, అరవబోకు' అన్నాడావ్యక్తి, నన్ను చాలా కాలంనుంచి ఎరిగి ఉన్నవాడిలాగ.

"నేనే అంటే, ఎవరునీవు"

"చెబుతాను. కొంచెం మెల్లగా మాట్లాడు."

"దొంగవేనా"

"అవును"

"ఎందుకొచ్చావు?"

"ఎందుకొచ్చానో తెలియదేం? ఎబ్బే, నిన్ను చూసి పోదామని వచ్చాను. అంతా కులాసాగా ఉన్నారా?" అని అడిగాడు దొంగ కొద్దిగా మందహాసంచేస్తూ.

వీడు ఎవడో సామాన్యపుదొంగగా లేడు. దొంగతనానికి వచ్చి క్షేమ సమాచారం అడుగుతున్నాడు. చాలా ఆశ్చర్యంగా ఉంది అనుకొన్నాను.

యెట్లావచ్చావు?

"యెట్లా వచ్చావూ?"

"దొడ్డివాకిలి తలుపు గడియ యెత్తేసి వచ్చాను. అయినా ఆ సంగతులన్నీ నీవు అడగకూడదు"

"కుక్కలున్నవి, పీకి చంపుతవి - అని వ్రాసిఉన్న నోటీసు చూడలేదా?"

"చూడకేం - చూశాను. అంతకుముందు వాటి అరుపులూ విన్నాను!"

"మరి...కరుస్తవి అనుకోలేదూ?"

"అరిచేకుక్కలు కఱవవు అని నాకు తెలును. అది కాక ఆ కుక్కలు మధ్య మధ్య మాట్లాడుకోవటంకూడా విన్నాను" అని మళ్ళీ నవ్వాడు ఆ పెద్దమనిషి.

వీడెవడో అసాధ్యుడు. మన గుట్టుఅంతా కనిపెట్టాడు. యెట్లాగు వీడిని వదిలించుకోటం? పైగా వీడు, తనపని తాను చేసుకుపోక ఇంట్లో ఉన్నవారితో కబుర్లలోకి దిగాడు! యెట్లా వీడితో వేగటం? అనుకొని, యెందుకైనా మంచిదని రామకృష్ణయ్యగారిని పిలవబోయాను.

"యెవరిని పిలుస్తున్నావు" అని కళ్ళు యెఱ్ఱజేశాడు ఆ దొంగ.

"మరేం భయంలేదు. మనవాడేలే! మనకు మంచి స్నేహితుడు" అన్నాను నేను.

"అల్లా అయితే వెళ్ళి లేపి పిలుచుకురా గాని - కేక వేస్తావేం తెలిసినవాళ్ళవగా?" అన్నాడు ఆయన. 'సరే, అని నేను చప్పుడు చేయకుండా అడుగులో అడుగు వేసుకొంటూ

వెళ్ళి రామకృష్ణయ్యగారిని లేపి "మీరు చెప్పిన రావాలె ఆ గదిలోకి. వచ్చింది దొంగే కాని చాలా విచిత్రమైన వ్యక్తి. మంచివాడు కూడాను." అని చెప్పి తీసుకొచ్చాను. తీసికొచ్చి ఆయనతో అన్నానూ, ఆ కొత్తవ్యక్తిని చూపిస్తూ, 'ఇదిగో, ఈయన మన ఇంటికి వచ్చాడు చాలా యోగ్యుడు' అని.

రామకృష్ణయ్య నమస్కరించి, 'మీ రేనా దొంగ గారు? చాలా సంతోషం. మీరు వస్తారని అనుకొంటూనే ఉన్నాము రెండు రోజులనుంచి' అన్నాడు.

దొంగ జవాబుగా చిరునవ్వు నవ్వాడు.

"కూర్చోండి" అన్నాడు రామకృష్ణయ్య. అతనిని కబుర్లలోకి దింపి, కాలయాపనచేసి పంపిద్దామని మా మాష్టారుగారి ఎత్తు వాడు ఆ విషయంలో మనకంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివాడు. "కూర్చుంటానికిటయ్యా మీ యింటికొచ్చింది?" అని ఉరిమి చూశాడు.

"తమవంటివారు మాబోటి బీదవాళ్ళయింటికి ఎందు కొస్తారండీ మరి!" అన్నాడు రామకృష్ణయ్యగారు.

దొంగ కొంచెం విసుగ్గా – "ఈ మాటలన్నీ కట్టిపెట్టి నీ ఆస్తి ఎక్కడుందో చెప్పు?" అన్నాడు యముడులాగ.

నే నేదో చెప్పబోతూంటే రామకృష్ణయ్యగారు నా మాటకు అడ్డొచ్చి, నన్ను చెప్పనియ్యక "మాకున్న ఆస్తిఅంతా అదిగో ఆ గదిలో ఉన్నది" అని వంటింటివైపు చూపాడు.

ఆ దొంగ "మీ రిద్దరూ, ఇక్కడే ఉండండి. కదిలినా, కేకవేసినా, మాటదక్కదు, ప్రాణాలు దక్కవు" అని కత్తి చూపాడు.

రామకృష్ణయ్యగారు నవ్వుతూ, "అల్లాంటి పిచ్చిపని ఏమీ చెయ్యము. మీరు నిర్భయంగా వెళ్ళి పని చక్కబెట్టు కొండి" అన్నాడు. దొంగ ఆ మాటలు నమ్మి వంట యింట్లోకి వెళ్ళాడు. ఇక మేమిద్దరం మాట్లాడుకొన్నాము.

"ఆ పాత్రసామాగ్రి అంతా జేరేస్తాడేమో!"

"అల్లాంటి వాటికి ఆశపడేరకం అయితే మీతోనూ, నాతోనూ మాట్లాడడు. పీడుకొంచెం ఘరానాదొంగ. మీరు మాట్లాడబోకండి. నేను వీడికో కాసేపు తమాషా చేస్తాను" అన్నారు రామకృష్ణయ్యగారు.

మేము ఇంకా గుసగుస లాడుతూనే ఉన్నాము. వాడు అప్పుడేవచ్చి "ఆయింట్లో ఏమున్నయి నాబొంద, అంట్ల బొచ్చెలు తప్పితే!" అన్నాడు విసుగ్గా.

"మా ఆస్తి అంతా అదేను బాబూ"|అన్నానునేను.

"అంతకంటే మా కొంపలో ఇంకేమీ లేవు. అవి తీసుకెళ్ళండి కావలిస్తే - దయఉంటే ఆ దబరాగిన్నె మాత్రము వదిలేసి వెళ్ళితిరా రేపుపొద్దున వండుకుతింటాము" అన్నాడు మాస్టరుగారు నవ్వుతూ.

"మీ వెధవ పాత్ర సామగ్రికోసం ఆశపడే వాడినికాదు నేను" అని కచ్చితంగా చెప్పేశాడు ఆ మనిషి.

"నీవు అల్లాంటి వాడవనే మేమూ అనుకున్నాము. కాని ఏంజేస్తాం. మాకున్న ఆస్తే అది. ఏదో ఒకటో రెండో

తీసికొని మమ్ముల్ని కృతార్థులనుచేసి వెళ్ళాలె మీరు. బొత్తిగా వద్దంటే ఎట్లాగు?'' అన్నాడు మా రామకృష్ణయ్య వినయంగా.

ఈ మాట విని ఆ మనిషి. ''నీవు పరాచకం ఆడితే వింటూ కూర్చుంటాననుకొన్నావా? ఆ పప్పులు ఉడకవు. మీ ఇంట్లో ఏమైనా ఆస్తి ఉందేమో చెప్పు'' అన్నాడు.

''ఇంకేముందండీ?'' అన్నాను నేను.

''ఆ పెట్టెలలో?''

''మా ఆడవాళ్ళ చీరెలూ, మాధోవతులూ చొక్కాలు ఉన్నవి. అన్నైనా పాతవీ, చినుగుపట్టినవీ,! కావలిస్తే పెట్టెలు తెరిచి చూపిస్తాను'' అన్నాను.

దొంగ విసుక్కొని ''వెండీ బంగారం ఏమైనాఉంటే బయటపెట్టు - ఊరికే సోదిపెట్టక''అన్నాడు.

''వెండి, బంగారాలు మా యింట్లో ఎక్కడివండి? నాగపోతరావు షావుకారింటికి వెడితిరా మీకు పుష్కలంగా లభిస్తవి. కావలంటే మీకు ఆయిల్లు చూపిస్తాను'' అన్నాడు రామకృష్ణయ్యగారు.

దొంగకు ఈమాటలేమీ రుచించలేదు. ఆడవాళ్ళ వంక తిరిగి, మర్యాదగా ''మీ మెళ్లో సొమ్ములేమీ లేవమ్మా అమ్మాయ్!'' అన్నాడు.

ఇందాకటనుంచి అక్కడే నుంచుని మా సంభాషణ అంతా వింటూఉన్న మా ఆవిడ ఈ దొంగయొక్క యోగ్యతను గురించి తెలిసికొన్నది కాబట్టి ధైర్యంగా, ''అయ్యో! అయ్యో! అంతమాత్రం కూడానా అన్నయ్యా! మీ బావ

సంపాదన తిండికే సరిపోవటంలేదు. సొమ్ములు చేయించటానికి ఎక్కడిది'' అన్నది.

ఆ మనిషి దొంగఅయినా కాస్త సహృదయం కలవాడు. మా ఆవిడ మాటలు విని జాలిపడి, నావైపు తిరిగి, ''పెళ్ళానికి సొమ్ములు చేయించుకోరటయ్యా? సంపాదిస్తున్నావు, మహాగొప్ప సంపాద్యము'' అంటూ నాలుగు చీవాట్లు వేశాడు. నేను బిక్కముఖంపెట్టి నుంచున్నాను, తప్పు నాదే అన్నట్లు. నాముఖంచూసి మా ఆవిడకే జాలివేసింది కాబోలు, ఆవిడఅన్నది. "మీ బావమటుకు ఏంజేస్తారన్నయ్యా? రోజులు అల్లాంటివి?" అని.

అతనుకూడా కాస్త మెత్తపడి, "అవ్వననుకో. అయినా ఆడపిల్లను బోసిమెడతో అట్టిపెడతాడటమ్మా ఎవరైనా? తప్పుకాదూ?" అన్నాడు ముక్కుమీద వేలువేసుకొని.

దొంగగారు చాలా పెద్దమనిషిలాగ ప్రవర్తించారు, ఇంతవరకు. ఎవరిమీదనూ చెయ్యి చేసుకోలేదు. మాయింట్లో ఏమీలేదని అతనికి కొంతవరకు నమ్మకం కలిగింది. కాని ఇంకా అనుమానం పీకిస్తున్నట్లుంది. అందుకని ఇల్లంతా కలియజూచి, తెల్లటి కంచాలవైపు చూపుతూ, "అవి వెండి కంచాలు కావుటయ్యా," అన్నాడు.

"కావు అన్నయ్యా, అవి గిల్టువి. నీ కెందుకూ?'' అని నవ్వుతూ అన్నది మా ఆవిడ.

చాలా ఆలస్యం అయిపోయిందని దొంగ అనుకొంటూ ఉన్నట్లు అతని ముఖమే చెపుతున్నది. అతనికి అనుమానం కూడా పోయినట్టు లేదు.

ఆ మనిషి కాసేపు ఆలోచిస్తూ నుంచుని అటూ, ఇటూ చూచి చివరకు, "అయితే వెండీ, బంగారం, డబ్బు అటువంటిది ఏమీ లేదంటారా ?" అన్నాడు కచ్చితంగా చెప్పమన్నట్లు చూస్తూ.

'లేదండీ' అని తెగేసి చెప్పాము – మేమంతా ఏక కంఠంతో.

"ఎందుకు లేదయ్యా! మీరు ఇద్దరూ సంపాదిస్తున్నారు కదా ? నేను నమ్మను. ఎక్కడో దాచారు ? ఉండకుండా ఉంటుందా యింత ఇంట్లో ? వెతుకుతాను' అన్నాడు.

"వెతుక్కోండి" అన్నది మా ఆవిడ ధైర్యంగా. వెండీ, బంగారంతప్ప ఇంకొకటి పుచ్చుకోడు ఈ మనిషి. అల్లాంటివి ఏవీ, మన యింట్లో లేవు. కాబట్టి వెతుక్కోమన్నాం. మరేమీ భయంలేదనితోచి, నేను మంచంపైన నిశ్చింతగా పడుకుని వాల్చాను.

"పోయిన రాత్రి మేలుకున్నారున్నాము, నిద్రముంచు కొస్తున్నది. నేనుకూడా పండుకొంటాను. వెళ్ళేటప్పుడు కాస్త చెప్పివెళ్ళవయ్యా తలుపు వేసుకొంటాము," అన్నాడు రామ కృష్ణయ్యగారు మత్తుగా.

"వచ్చినదారినే వెళ్ళు అన్నయ్యా" అన్నది మా ఆవిడ.

దొంగ ఈ మాటలు విని, ఆలోచనలో పడ్డట్టున్నాడు వెతుకుదామా వద్దా అని ? వెతికినా లాభంలేదని తోచిం దేమో అతనికి ? లేకపోతే ఎందుకు అల్లాగ నిలబడి ఊరు కొంటాడూ తనపని తాను చేసుకోక ?

రామకృష్ణయ్యగారు లేచి దీపం "వెలిగించబోయినాడు.

దొంగ "వెలిగించకు, నేను వెతుక్కుంటానులే" అన్నాడు.

రామకృష్ణయ్యగారు నవ్వుతూ "వెలిగించ నియ్యవయ్యా, ధనం ఎక్కడుందో, వెతుకున్నావుగా? నీతో పాటు నేనుకూడా వెతుకుతాను నీకు సాయంగా" అన్నాడు.

"ఏమీ లేదన్నావుగా నీవు?"

"అన్నాను. అన్నాను కాని ఇంతయింట్లో ఉండక పోతుందా అని నీవు అన్నతరువాత, నాకూ అనుమానంగానే ఉంది ఎక్కడైనా ఉందేమోనని!" అన్నాడు రామకృష్ణయ్యగారు.

'సరేలే పడుకో' అని దొంగ విసుక్కున్నాడు. తనను కూడా వెతకనియ్యనందుకు విచారపడుతూ కుర్చీలో కూల పడ్డాడు మా మాస్టరుగారు. నేను కూడా లేచి కూర్చు న్నాను. మా ఆవిడా వాళ్ళు ప్రక్కగదిలోకి వెళ్ళిపోయి నారు. రెండు మూడు నిమిషాలు గడిచింది.

దొడ్డితలుపు విసిరివేసిన శబ్దం అయింది! 'అతడు వెళ్ళిపోయినాడు?' అన్నాను నేను. 'వెళ్ళాడు' అన్నాడు రామకృష్ణయ్యగారు.

రామకృష్ణయ్యగారు ఆలోచిస్తూ ఉన్నట్లు కనబడ్డది. "ఏమిటండీ అంతగా ఆలోచిస్తున్నారు?" అన్నాను.

ఆయన వెంటనే జబాబివ్వక తీవ్రంగా ఆలోచించి చివరకు "ఈ దొంగ చూశారూ! సామాన్యుడుకాడు. ఘరానామనిషి. వెండి బంగారం తప్ప ఇంకొకటి తీసుకోడు.

కాబట్టి అవి ఎక్కడున్నయో తెలిసికోటంలో చాలా అను భవం ఉండి ఉండాలె. ఏమంటారు?" అన్నాడు.

"అవును. నిజమే" అన్నాను నేను.

"అవునా. అట్లాంటి తెలిసిన మనిషి 'ఈ యింట్లో బంగారం ఎక్కడో ఉండే ఉంటుంది' అని ఊరికే అనడు. ఉండేఉంటుంది. అతనికి వ్యవధి లేక వెళ్ళిపోయిఉంటాడు. పోనీ మనం వెతుక్కుందామా, ఏమిటి' అన్నాడు" కను బొమ్మ లెగరేస్తూ ఆశగా.

సరే అన్నాను నేను ఆయన మాటలయందు అంతగా విశ్వాసం లేనట్లు చూస్తూ. ఇప్పుడు మా యింటికి మే మే దొంగలమైనాము.

వెతుకుతున్నాము, వెతుకుతున్నాము, ఎక్కడన్నా వెండీ బంగారమూ ఉండకపోతుందా అని! ఇంతవరకు ఏమీ కనుపించలేదు. కాని 'ఎక్కడో ఉండకపోతుందా' అని వాడు ఊరికే అంటాడా? వాడికేదో వాసనకొట్టే అని ఉంటాడు. ఎప్పటికైనా దొరకవచ్చునని ఆశగాఉంది.